సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 26 । అక్టోబర్ । 2024



కిలో టమాట రూ.32

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.32, కనిష్టంగా రూ.9, సరాసరిన రూ.21 ప్రకారం ధర పలికింది.



హన్నా.. గెలుపు మిన్న

సోములదొడ్డికి చెందిన ఆనంద్.. హన్నారాథోడ్‌గా మారారు. విదేశాల్లో శాస్త్రవేత్తగా రాణిస్తూ గెలిచేసిన వారితోనే ఘన స్వాగతాలు అందుకుంటున్నారు. 10లో

గరిష్టం/కనిష్టం
34.9°/18.5°

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్ష సూచన



బుక్కరాయసముద్రం: ఉమ్మడి అనంతపురం జిల్లాకు రాబోయే రెండు రోజులు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో చిరుజల్లులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 32.8–33.6, రాత్రి ఉష్ణోగ్రతలు 21.1–22.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చని తెలిపారు.

11లోపు ‘పది’ పరీక్ష ఫీజు చెల్లించాలి



పుట్టపర్తి: జిల్లాలో 10వ తరగతి చదువుతున్న రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులంతా నవంబర్ 11వ తేదీలోపు పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ మీనాక్షి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 28వ తేదీ నుంచి నవంబర్ 11వతేదీలోపు ఫీజు చెల్లించాలన్నారు. ఆ తర్వాత అదనపు రుసుంతో ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. నవంబర్ 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రూ.50, నవంబర్ 19 నుంచి 25వ తేదీ వరకు రూ.200, నవంబర్ 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

4 నుంచి డీఎడ్ పరీక్షలు



పుట్టపర్తి: జిల్లాలోని డీఎడ్ (2018–20 బ్యాచ్‌కు మొదటి సంవత్సరం) విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నవంబర్ 4 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ రవి సాగర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఇక 2023–25 బ్యాచ్ డీఎడ్ విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ) పరీక్షలు నవంబర్ 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ డీఎడ్ కళాశాలలు మూతపడ్డాయని, అలాంటి కళాశాలల్లో చదివిన విద్యార్థులు అదనపు ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. మరింత సమాచారం కోసం బుక్కపట్నంలోని జిల్లా డైట్ కళాశాలలో ఈ నెల 30వ తేదీ లోపు సంప్రదించాలన్నారు.

రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం

- జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు



పుట్టపర్తిలో వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ విజయకుమార్

పుట్టపర్తి టౌన్: పోలీసులు రాత్రివేళ గస్తీ ముమ్మరం చేశారు. ఇటీవల చోటుచేసుకున్న పలు సంఘటనలు దృష్టిలో ఉంచుకొని చోరీల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఎస్పీ రత్న సూచనల మేరకు రాత్రివేళ ముమ్మరంగా గస్తీ చేశారు. గురు, శుక్రవారాల్లో రాత్రివేళ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపైనా కేసులు నమోదు చేశారు. గంజాయి, అక్రమ మద్యం రవాణా కట్టడికి చర్యలు చేపట్టారు. గ్రామాలను సందర్శించి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

పైన పొత్తులు.. లోన కత్తులు

ఆయన ఆ సీట్లో కూర్చుంటే సహించేదే లేదు. అసలు ఎవరు ఆయన్ను ఇక్కడికి పంపారో తెలియదు. వెంటనే వెనక్కి వెళ్లిపోవాలి. లేదంటే నేనే మున్సిపల్ కార్యాలయానికి పోతా... కమిషనర్ చొక్కా పట్టుకుని తన్నుకుంటూ బయటకు పంపిస్తా. మున్సిపల్ కార్యాలయానికి తాళం వేస్తా.

– ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున నియామకం సందర్భంగా టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ చేసిన వ్యాఖ్యలివి.

కమిషనర్ మల్లికార్జున సమర్థుడు. ధర్మవరం అభివృద్ధిని కాంక్షించి ఆయన్ను మున్సిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. కానీ ఆయన్ను కొన్ని పార్టీల నాయకులు అడ్డుకుంటున్నారు. అది మంచి పద్ధతి కాదు. అధికారులకు రాజకీయాలను ఆపాదించడం మానుకోవాలి. ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జునే కొనసాగుతారు.

– పరిటాల శ్రీరామ్ వ్యాఖ్యల అనంతరం మంత్రి సత్యకుమార్ విలేకరులతో అన్నమాటలివి.

...ఇలా ప్రతి అంశంలోనూ ధర్మవరంలో కూటమి పార్టీల నేతల మధ్య రగడ జరుగుతోంది. మంత్రి సత్యకుమార్ మాటలను టీడీపీ కేడర్ కనీసం పట్టించుకోవడం లేదు. తాజాగా గురువారం తాడిమర్రిలో బీజేపీ నేతలు మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తుండగా..టీడీపీ నేతలు అడ్డుకున్నారు. తోకలు జాడిస్తే కట్ చేస్తామంటూ హెచ్చరించారు.

- ధర్మవరంలో కూటమి నేతల వేరు కుంపట్లు
- సమన్వయ లేమితో స్థానిక నేతల సిగపట్లు
- ప్రతి విషయంలో టీడీపీ – బీజేపీ మధ్య తగాదాలు
- మంత్రి సత్యకుమార్‌ను లెక్కచేయని పరిటాల శ్రీరామ్ వర్గం
- ఇప్పటికే పంతాలకు పోయి మున్సిపల్ కమిషనర్‌పై బదిలీ వేటు
- తాజాగా మద్యం దుకాణం నిర్వహణలోనూ పరిటాల శ్రీరామ్ హవా



మంత్రి సత్యకుమార్ క్యాంపు కార్యాలయం ఎదుట టీడీపీ నేతల ధర్నా (ఫైల్)



సాక్షి, పుట్టపర్తి

జిల్లాలో కూటమి పార్టీల నేతలు పైకి కలిసి ఉన్నట్లు నటిస్తున్నా.. లోలోన మాత్రం కయ్యానికి కత్తులు నూరుతున్నారు. నియోజకవర్గ స్థాయి నేతలు జోక్యం చేసుకుంటున్నా కేడర్ అసలు లెక్కచేయడం లేదు. ప్రతి చిన్న విషయంపై ఇరు పార్టీల నేతలు రచ్చకెక్కుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతి విషయంలోనూ తగాదాలు బహిర్గతమవుతున్నాయి. ఆరంభంలో రేషన్ డీలర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల కోసం పోటీ పడ్డారు. తర్వాత నామినేటెడ్ పదవుల కోసం ప్రముఖులు లాబీయింగ్ చేశారు. ఆ తర్వాత అధికారుల బదిలీల్లోనూ పైచేయి సాధించేందుకు ఎవరికి వారుగా బలాబలాలు నిరూపించుకునేయత్నం చేశారు. తాజాగా మద్యం దుకాణాల నిర్వహణలోనూ కూటమి నేతల మధ్య విభేదాలు బట్టబయలు అయ్యాయి. ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాల్లో మద్యం దుకాణాల నిర్వహణలో టీడీపీ నేతలు పెత్తనం చేస్తుండగా..కూటమిలోని మిగతా పార్టీల నేతలు రగిలిపోతున్నారు. తాము లేకపోతే టీడీపీ ఎక్కడుందంటూ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

పుట్టపర్తిలో మాజీ మంత్రి హవా..

పుట్టపర్తి నియోజకవర్గంలోనూ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. సామాజిక సమీకరణాల పేరుతో ఓ వర్గం నాయకులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా అధికారుల బదిలీల్లో అన్నీ తానై వ్యవహరించారు. నియోజకవర్గంలోని ఏ ఒక్కరికీ ప్రాధాన్యం ఇవ్వలేదనే విమర్శలున్నాయి. మరోవైపు ఓడీ చెరువులో ఓ మద్యం దుకాణం నిర్వహణ విషయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిపై భారీ విమర్శలు వచ్చాయి. సదరు షాపు పంచాయితీ ఏకంగా సీఎం చంద్రబాబు వద్దకు వెళ్లినట్లు సమాచారం.

కప్పం కట్టేందుకు రాలేదనే..

మద్యం దుకాణాల నిర్వహణ అంతా టీడీపీ నేతల కనుసన్నల్లోనే సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే టీడీపీ ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గంలో ప్రతి నెలా దుకాణం నుంచి కమీషన్ వచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో కూటమిలోని మిగతా పార్టీల నేతలకు ఎలాంటి సంబంధం లేకుండానే వ్యవహారాలు జరుగుతున్నాయి. కానీ ధర్మవరంలో మాత్రం బీజేపీ ఎమ్మెల్యే పెత్తనాన్ని టీడీపీ నేతలు సహించడం లేదు. మంత్రి సత్యకుమార్ ఏం చేసినా టీడీపీ నేతలు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. మద్యం దుకాణాల విషయంలో ఈ విషయం స్పష్టంగా బహిర్గతమైంది.

అధికారులపై ఒత్తిళ్లు..

మద్యం దుకాణాల విషయంలో మాటవినని నిర్వాహకులపై టీడీపీ నేతలు కక్ష గట్టారు. తమ మాటే లెక్కచేయవా..? అంటూ బెదరింపులకు దిగుతున్నారు. అలాగే ఎక్సైజ్ అధికారులతో తనిఖీలు చేయించడం.. మద్యం దుకాణం పక్కనే పోలీసులతో వాహనాల తనిఖీలు చేయించడం వంటివి చేయించేందుకు ఒత్తిడి చేస్తున్నారు. టీడీపీ నేతల ఒత్తిళ్లతో ఎక్సైజ్, పోలీసు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

ధర్మవరంలోనే అధికం..

ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున నియామకాన్ని మంత్రి సత్యకుమార్ సమర్థించగా.. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌తో సహా ఆయన వర్గీయులు వ్యతిరేకించారు. విధులు నిర్వర్తిస్తే ఖబడ్దార్ అంటూ కమిషనర్‌ను హెచ్చరించారు. అంతేకాకుండా ఏకంగా మంత్రి సత్యకుమార్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. మంత్రిని అడ్డుకుని ఘెరావ్ చేశారు. ‘మేం కష్టపడి గెలిపిస్తే మంత్రివి అయ్యావు..నీవు.. మాపై ఆధిపత్యం చేస్తే ఊరుకోం. మీ సంగతి చూస్తాం..’ అంటూ పత్రికల్లో రాయలేని భాషలో ఆనాడు దుర్భాషలాడారు. అనంతరం ఇరువర్గాల నాయకులు ఓ చోట సమావేశమై సమన్వయంగా ఉంటామని బహిరంగంగా వెల్లడించారు. కానీ వారం రోజులు తిరక్కుండానే మున్సిపల్ కమిషనర్‌పై బదిలీ వేటు పడింది. మంత్రి సత్యకుమార్‌పై పరిటాల శ్రీరామ్ పంతం నెగ్గేందుకు ఓ అధికారికి రాజకీయ రంగు పూసి ఇబ్బందులకు గురి చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా మద్యం దుకాణాల నిర్వహణలో పరిటాల శ్రీరామ్ పెత్తనం అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణకు చెందిన ఓ వ్యక్తికి తాడిమర్రిలో మద్యం దుకాణం దక్కగా... అతని వద్ద నుంచి బీజేపీ నేతలు లీజుకు తీసుకుని గురువారం మద్యం దుకాణం ఏర్పాటు చేస్తుండగా.. ‘తెలుగు తమ్ముళ్లు’ అడ్డుకున్నారు. అన్న (పరిటాల శ్రీరామ్)ను కాదని ఎలా వ్యాపారం చేస్తారో చూస్తామంటూ హెచ్చరించారు.



గురువారం తాడిమర్రిలో మద్యం దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి

- వరికి ఎకరాకు రూ.1,600, వేరుశనగకు రూ.480 చెల్లించాలి
- కలెక్టర్ టీఎస్ చేతన్ వెల్లడి



అధికారులు, బీమా సంస్థ ప్రతినిధులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: పంటల బీమాకు రైతులే ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని కలెక్టర్ చేతన్ తెలిపారు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ చేతన్.. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతోపాటు బీమా కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ రబీ నుంచి 2019కి ముందు ఉన్న పంటల బీమానే అమలవుతుందన్నారు. వరికి డిసెంబర్ 31వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేరుశనగ, జొన్న, శనగ, మొక్కజొన్న, మిరప పంటలకు మాత్రం డిసెంబర్ 15వ తేదీలోపే మీసేవ కేంద్రాలు, సచివాలయాల్లో ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వరికి ఎకరాకు రూ.630, వేరుశనగకు రూ.480, టమాటకు రూ.1,600 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రెండు రోజుల్లో నివేదిక ఇవ్వండి..

ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పంట, ఆస్తి నష్టంపై రెండు రోజుల్లో నివేదిక రూపొందించాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. నివేదికను సామాజిక తనిఖీ కోసం ఆయా రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల్లో ఉంచాలని, అదే కాపీని తనకు పంపాలన్నారు. అధికారులు రూపొందించిన జాబితాను ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు, సీపీఓ విజయకుమార్, ఎల్‌డీఎం రమణకుమార్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, బీమా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

‘అపార్’ కోసం రిజిస్టర్ చేసుకోవాలి

ఆధార్ తరహాలో విద్యార్థులకు ప్రభుత్వం ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ఇస్తోందని, దీనికోసం విద్యార్థులంతా తప్పక రిజిస్టర్ చేయించుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ఒక ప్రకటలో కోరారు. ఆధార్‌లో వివరాల ఆధారంగానే రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు.

నీటి ట్యాంకులన్నీ శుభ్రం చేయాలి

ఇటీవల జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో రెండు రోజుల్లో జిల్లాలోని నీటి ట్యాంకులన్నీ శుభ్రం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తన క్యాంప్ కార్యాలయం నుంచి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, రక్షిత తాగునీటి కాలుష్యం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంపై సమీక్షించారు. క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

ఆర్టీసీ ఉద్యోగి పేరిట ఇతరులకు రుణం

- ఏపీజీబీ అధికారుల నిర్వాకం
- వివరాలు ఆరా తీసేందుకు వెళితే రుణం చెల్లించాలని డిమాండ్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితుడు (మధ్య ఉన్న వ్యక్తి)

హిందూపురం: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు ఓ ఆర్టీసీ ఉద్యోగి జీవితంతో ఆటలాడుకుంటున్నారు. అతని ఆధారాలతో ఎవరికో రుణం ఇచ్చి.. ఆ మొత్తం రికవరీ కాకపోవడంతో రుణ ఎగవేతదారునిగా చూపారు. వివరాల్లోకి వెళితే.. హిందూపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసే షేక్ బాబావలి ఇటీవల రుణం కోసం ఎస్‌బీఐలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే రుణం మంజూరు కాకపోవడంతో ఆరా తీశాడు. దీంతో బ్యాంకు ఉద్యోగులు అతనికి పిడుగులాంటి వార్త చెప్పారు. 2017లో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ముద్రలోన్ కింద రూ.లక్ష రుణం తీసుకున్నావని, అందులో ఇంకా రూ.89,822 మొత్తం చెల్లించాల్సి ఉందన్నారు. ఆ మొత్తం ఏపీజీబీ వారికి చెల్లించి నో డ్యూ సర్టిఫికెట్ తెస్తే రుణం మంజూరు చేస్తామన్నారు. దీంతో షేక్ బాబావలి వెంటనే వెళ్లి ఏపీజీబీ మేనేజర్‌ను సంప్రదించాడు. రహమత్‌పురలోని తన అడ్రస్‌తో ఉన్న ఆధార్‌తో రూ.లక్ష రుణం మంజూరైనట్లు తెలిసి కంగుతిన్నాడు. అయితే లోన్ తీసుకున్న వ్యక్తి ఫొటో తనది కాదని, ఎవరో మోసం చేశారని బాబావలి వివరించాడు. బ్యాంకు అధికారులు మాత్రం విచారించి క్లియరెన్స్ ఇస్తామని చెప్పి పంపించారు. తన ఆధార్‌కార్డుతో మరో వ్యక్తికి బ్యాంకు అధికారులు ఎలా లోన్ మంజూరు చేశారో అర్థం కావడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీనిపై హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు మీడియాకు తెలిపారు.

ఘాటు తగ్గిన ఎండుమిర్చి

- ఎండుమిర్చి ధరలపై వర్షం ప్రభావం
- దిగుబడి చేతికందే సమయంలోనే తుపాను
- మిర్చి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపిన వాన
- పంట ఆరబెట్టుకోలేక అల్లాడుతున్న రైతులు
- గత ఏడాదితో పోలిస్తే క్వింటాపై రూ.7 వేలు తక్కువ





హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి క్రయ విక్రయాలు

గత మార్చి నుంచి హిందూపురం మార్కెట్‌లో ఎండు మిర్చి ధరలు ఇలా (క్వింటాపై)

తేదీ	మొదటి రకం	రెండో రకం	మూడో రకం
20.03.24	రూ.19,000	రూ.17,000	రూ.7,000
16.04.24	రూ.18,000	రూ.14,800	రూ.7,200
24.09.24	రూ.19,000	రూ.9,000	రూ.7,000
18.10.24	రూ.15,000	రూ.14,500	రూ.7,000
21.10.24	రూ.15,100	రూ.10,000	రూ.7,000

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి రైతుల ఆశలపై వరుణుడు నీళ్లు పోశాడు. సరిగ్గా దిగుబడి చేతికందే సమయంలో రోజుల తరబడి వర్షిస్తూ కోలుకోలేని దెబ్బతీశాడు. వర్షానికి నానిపోయిన పంటను మార్కెట్‌లో కొనేవారు లేక...దాన్ని ఎండబెట్టుకోలేక రైతులు అల్లాడిపోతున్నారు. ఈ పరిస్థితుల్లోనే కొంతమంది రైతులు పచ్చిగా ఉన్న మిర్చినే మార్కెట్‌కు తీసుకువస్తుండటంతో కనీస ధర కూడా దక్కడం లేదు.

మార్కెట్‌లోనూ ఇబ్బందులు..

ఎండుమిర్చి క్రయవిక్రయాలకు జిల్లాలో హిందూపురం వ్యవసాయ మార్కెట్ ప్రధాన వనరు. ఇక్కడి మార్కెట్‌కు ప్రతి మంగళ, శుక్రవారం హిందూపురం పరిసర ప్రాంతాలతో పాటు మడకశిర, గౌరిబిదనూరు, శిర, పావగడ, గోరంట్ల, కదిరి, పెనుకొండ ప్రాంతాల నుంచి రైతులు ఎండు మిర్చి తీసుకు వస్తుంటారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో తేమశాతం ఎక్కువగా ఉన్న సరుకే వస్తోంది. మార్కెట్‌లోనూ మిర్చి ఆరబెట్టేందుకు గానీ, ధరలు తక్కువ ఉన్న సమయంలో నిల్వ ఉంచుకునేందుకు గానీ గోదాములు లేవు. ఈ పరిస్థితుల్లో రైతులు ధర ఉన్నా... లేకున్నా మార్కెట్‌లో అమ్మడమో.. లేకపోతే వెనక్కు తీసుకెళ్లడమో చేస్తున్నారు. చాలా మంది వెనక్కుతీసుకెళ్తే రవాణా ఖర్చులు వస్తాయని మార్కెట్‌లో ఉన్నరేటుకు పంట ఇచ్చి పోతున్నారు. ఇక్కడి మార్కెట్‌లో కనీసం రెండు, మూడు రోజులు పంట నిల్వ చేసుకునేందుకు గోదాము ఉండి ఉంటే తమకు ఎంతో మేలు జరిగేదని రైతులు చెబుతున్నారు.

గత ఏడాదితో పోలిస్తే భారీగా తగ్గిన ధర

హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో గత ఏడాది మిర్చి నాణ్యమైన సరకు(మొదటి రకం) రూ.22 వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ. 7 వేలు తగ్గి క్వింటా రూ.15 వేలు మాత్రమే పలుకుతోంది. ఒక్కసారిగా ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 2020–21లో మార్కెట్‌కు 12,221 క్వింటాళ్ల మిర్చి రాగా, 2021–22లో 18,661 క్వింటాళ్లు, 2022–23లో 8,044 క్వింటాళ్లు, 2023–24లో 15,476 క్వింటాళ్లు వచ్చింది. గతంలో ధరలు కూడా ఆశాజనకంగా ఉండేవి. ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది.

గుంటూరుతో పోలిస్తే క్వింటాకు రూ.3 వేలు తక్కువ..

గుంటూరు మిర్చి మార్కెట్‌తో పోలిస్తే హిందూపురం మార్కెట్‌లో క్వింటాకు మొదటి రకం మిర్చికి రూ.3 వేల తేడా కనిపిస్తోంది. ఈనెల 21వ తేదీ సోమవారం గుంటూరు మార్కెట్‌లో మిర్చి మొదటి రకం రూ.18,600 వరకు పలుకగా, రెండో రకం రూ.8,500 వరకు ధర పలికింది. కానీ హిందూపురం మార్కెట్‌లో మొదటిరకం మిర్చి రూ.15,100 మాత్రమే పలికింది.

తగ్గిన ఎగుమతులు..

హిందూపురం మార్కెట్ నుంచి ప్రతివారం బెంగళూరు, చెన్నై, కొచ్చి, హైదరాబాద్ తదితర నగరాలకు ఎండుమిర్చి ఎగుమతి అయ్యేది. అయితే ప్రస్తుతం వర్షాల కారణంగా మార్కెట్ అంతగా లేదు. దీంతో రోజూ రెండు, మూడు లారీలు మించి సరుకు ఎగుమతి కావడం లేదు. వర్షాలతో ట్రాఫిక్ సమస్యలు, లోడింగ్, అన్‌లోడింగ్ సమస్యలు ఎదురవుతుండగా...ఎవరూ పంటను ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లేందుకు సాహసించడం లేదు.

ధరలు తగ్గాయి



ఆటుపోట్లు ఎదుర్కొని ఎండుమిర్చిని పండించడం ఒక ఎత్తయితే... ఆరబోసి, ఎండబెట్టడం మరో ఎత్తు. ఇంతాచేసి మార్కెట్‌కు తీసుకెళితే ఆశించిన ధర దక్కడం లేదు. 40 కిలోల మిర్చి తీసుకురాగా రూ.4,200 చేతికి వచ్చింది. గతంలో కిలో రూ.190పైనే పలికేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

– ఎం.ఆదినారాయణరెడ్డి, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

చేనులోనే దెబ్బతింది



జూలై చివరిలో అర ఎకరంలో ఎండుమిర్చి వేశాం. మొదట వర్షాలు సరిగా లేవు. అయినా కష్టపడి పంటను కాపాడుకున్నాం. తీరా పంట చేతికందే సమయంలో వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. తేమశాతం ఎక్కువ కావడంతో ధర భారీగా పడిపోయింది. ఏం చేయాలో తెలియక పంటను ఆరబెట్టుకుని మంచి రేటు వచ్చిన తర్వాత విక్రయించుకుందామని ఇంట్లోనే ఉంచుకున్నాం.

– ప్రభావతమ్మ, కొత్త చామలపల్లి, చిలమత్తూరు మండలం

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన భానుతేజ

కదిరి అర్బన్: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు కదిరి పట్టణానికి చెందిన విద్యార్థి భానుతేజ ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. నవంబర్ 6 నుంచి 10వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టు తరఫున భానుతేజ ప్రాతినిధ్యం వహించనున్నట్లు వాల్మీకి పాఠశాల నిర్వాహకులు పవన్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు: డీఎంహెచ్‌ఓ


శిక్షణలో పాల్గొన్న వైద్యాధికారులు

పుట్టపర్తి అర్బన్: వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి పేర్కొన్నారు. ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించేందుకు వైద్యాధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన రెండు రోజుల ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. విధి నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాలపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్వియా సోలోమన్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్, డీపీఎంఓ డాక్టర్ కుల్లాయప్ప నాయక్, డాక్టర్ తిప్పయ్య, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ నివేదిత, జిల్లాలోని 42 పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

29న జిల్లా హ్యాండ్‌బాల్ మహిళా జట్టు ఎంపిక

కదిరి అర్బన్: హ్యాండ్‌బాల్ సీనియర్ ఉమెన్స్ జిల్లా జట్టును ఈ నెల 29న స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి మహేష్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు 83176 73593లో సంప్రదించాలని కోరారు.

హన్నా... గెలుపు మిన్న

- ఆత్మవిశ్వాసంతోనే అసాధారణ స్థాయికి
- స్పెయిన్‌లో శాస్త్రవేత్తగా రాణింపు
- 2023లో 'మిస్ వరల్డ్ ట్రాన్స్' పోటీల్లో రన్నరప్
- నవంబర్‌లో మిస్ యూనివర్స్ ట్రాన్స్ పోటీలకు సిద్ధం
- హన్నా రాథోడ్ స్ఫూర్తిదాయక ప్రస్థానం



పట్టుమని 200 కుటుంబాలు నివాసమున్న గ్రామం. నగర శివారులో ఉన్నా... కాంక్రీట్ జంగిల్ పోకడలు కనిపించవు. పదో తరగతి వరకూ గ్రామంలో బేల్దారి పనులు, నగరంలో పండ్ల విక్రయంతో తల్లిదండ్రులకు చేదోడు. చిరుప్రాయం నుంచే శారీరక మార్పులతో సహ విద్యార్థుల చిన్న చూపు. వ్యక్తి వెనుక సూటిపోటి మాటలు... అవమానకర వ్యాఖ్యలు.

కట్ చేస్తే..

ప్రస్తుతం స్పెయిన్ దేశంలో ఫార్మా రంగ శాస్త్రవేత్త... ట్రాన్స్‌ఫ్యూజన్ శస్త్రచికిత్స తర్వాత ప్రపంచ దేశాలు గుర్తించేలా మిస్ వరల్డ్ ట్రాన్స్ రన్నరప్.. స్ఫూర్తిదాయక జీవనంతో పలువురికి ఆదర్శం. నవంబర్‌లో మిస్ యూనివర్స్ ట్రాన్స్ విజేత దిశగా అడుగులు.

... ఇది అనంతపురం జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్ హన్నా రాథోడ్ విజయ ప్రస్థానం. చదువుతో ఆమె సాధించిన ఒక్క గెలుపు కుటుంబాన్నే కాదు.. ఏకంగా జిల్లా కీర్తిప్రతిష్టలను పెంచింది. స్ఫూర్తిదాయకమైన ఆమె జీవనం ఆమె మాటల్లోనే...

– అనంతపురం

మాది అనంతపురం రూరల్ పరిధిలోని సోములదొడ్డి గ్రామం. నాన్న మల్లేష్, అమ్మ పద్మావతికి మూడో సంతానంగా పుట్టాను. ఓ అన్న, అక్క ఉన్నారు. నాకు ఆనంద్‌బాబు అని పేరుపెట్టారు. అమ్మ, నాన్న అనంతపురం నగరంలోని తాడిపత్రి బస్టాండ్‌లో పండ్ల వ్యాపారం చేసేవారు. పేదరికం కారణంగా పస్తులతో గడిపిన రోజులెన్నో చూశా. దీంతో బడికి వెళ్లే సమయంలోనే ఏ మాత్రం వీలు చిక్కినా ఊళ్లో కూలి పనులకు, అమ్మ, నాన్నతో కలసి పండ్ల వ్యాపారం చేస్తూ వచ్చా. ఆరేళ్ల వయసులో ఉన్నప్పుడు నాలో శారీరక మార్పులు గుర్తించా. సమాజానికి తెలిస్తే బయటకు గెంటేసి హేళన చేస్తారేమోనని భయపడ్డా. దీంతో ఎవరితోనూ చెప్పుకోలేదు. చిన్న కొడుకు కావడంతో మా అమ్మ నన్ను ఎంతో గారాబంతో పెంచుతూ వచ్చింది.

నా వెనుక గేలి చేసేవారు

సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న వివక్ష నన్ను చాలా భయపెట్టేది. ఇలాంటి సమయంలో కేవలం చదువు ఒక్కటే నా సమస్యకు చక్కటి పరిష్కారమని గుర్తించాను. దీంతో పట్టుదలగా చదువుకుంటూ క్లాస్‌లో టాపర్‌గా నిలుస్తూ వచ్చా. ఇంటర్ వరకూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో తెలుగు మీడియం చదివిన నేను ఆ తర్వాత అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీ-ఫార్మసీ చేశా. అక్కడ చాలా మంది స్నేహితులు ఉండేవారు. వారిలో కొందరు నా ముందు ఏమీ అనకపోయినా... నా వెనుక చెడుగా మాట్లాడుకునేవారని తెలిసి బాధపడ్డాను. జన్యుపరమైన లోపాన్ని ఎవరూ గుర్తించలేదు. గేలి చేసినా కుంగిపోలేదు. పట్టుదలతో బీ-ఫార్మసీ, ఎం-ఫార్మసీ పూర్తి చేశా.

పెళ్లి ప్రయత్నాల నుంచి బయటపడి

ఎం-ఫార్మసీ పూర్తి చేసిన తర్వాత విదేశాల్లో ఎంఎస్ చేయాలని అనుకున్నా. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించలేదు. దీంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా రెండేళ్లు పనిచేశా. అదే సమయంలో జూనియర్ ఫార్మసీ విద్యార్థులకు ట్యూషన్లు చెప్పడం ద్వారా వచ్చిన డబ్బును దాచుకుని విదేశీ విద్యావకాశాలపై అన్వేషిస్తూ వచ్చా. ఈ లోపు అనంతపురం కలెక్టరేట్‌లో ఉద్యోగం వచ్చింది. ఈ విషయం తెలియగానే చాలా మంది అమ్మాయిని ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. అయితే పెళ్లి చేసుకుని ఆమె జీవితాన్ని నాశనం చేయకూడదని భావించిన నేను... విదేశాలకు వెళ్లిపోతే పెళ్లి ప్రయత్నాలు వాయిదా పడతాయనుకున్నా. అదే సమయంలో విదేశీ విద్యావకాశాలపై అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్ష రాసి మెరుగైన ఫలితాలతో స్పెయిన్‌లో ఎంఎస్ సీటు దక్కించుకున్నా. కోర్సు పూర్తి కాగానే అక్కడే బయో ఇంజినీరింగ్ సొల్యూషన్స్‌లో శాస్త్రవేత్తగా పనిచేసే అవకాశం వచ్చింది. శాస్త్రవేత్తగా స్థిరపడిన తర్వాత 2021లో ట్రాన్స్‌ఫ్యూజన్ ఆపరేషన్ చేయించుకుని హన్నారాథోడ్‌గా పేరు మార్చుకుని ఇంట్లో వారికి విషయం చెప్పా.

చదువే సెలబ్రిటీని చేసింది

ట్రాన్స్‌జెండర్ల జీవితం ఎప్పుడూ సాఫీగా ఉండదు. మన వ్యక్తిత్వం చెదరకుండా కాపాడుకోవాలి. ఎలాంటి వ్యక్తికైనా ప్రతికూల కాలమంటూ ఉంటుంది. నిరాటంకంగా అవరోధాల్ని అధిగమించి విజయం సాధిస్తే ఈ సమాజమే గౌరవప్రదంగా చూస్తుంది. మనం కోరకుండానే వచ్చే జన్యుపరమైన లోపాలకు కుంగిపోరాదు. ఆత్మస్థైర్యాన్ని కోల్పోయి, ధర్మాన్ని, దైవాన్ని నిందించడం కూడా పొరబాటే. అసలు ప్రతికూలతల్లో కూడా అనుకూలతను వెదికి అనుకూలంగా మలచుకునే యుక్తిని సాధించగలగాలి. అప్పుడే విజయం మన సొంతమవుతుంది. నా జీవితమే ఇందుకు నిదర్శనం. చదువే నన్నున్న సెలబ్రిటీని చేసింది. ఈ స్థాయికి నేను ఎదగడంలో ఎదుర్కొన్న కష్టాలు, బాధలు వివరిస్తూ తెలుగు, ఇంగ్లిష్, స్పానిష్ మూడు భాషల్లో పుస్తకం రచిస్తున్నా. త్వరలో ఈ పుస్తకాన్ని మీ ముందుకు తీసుకువస్తా.


హన్నా రాథోడ్

మిస్ వరల్డ్ పోటీల్లో ప్రతిభ



గతేడాది స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో మిస్ వరల్డ్ ట్రాన్స్-2023 పోటీలు జరిగాయి. అక్కడే పనిచేస్తున్న నాకు ఈ విషయం తెలిసి భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు దరఖాస్తు చేసుకున్నా. దీంతో నిర్వాహకులు అవకాశం ఇచ్చారు. ఈ పోటీలో ఏకంగా రన్నరప్‌గా నిలవడంతో నాలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. దీంతో సేవా కార్యక్రమాలు చేపట్టి ట్రాన్స్ సమాజంలో సమూల మార్పులు తీసుకురావాలని భావించాను. ఆ దిశగా తొలి ప్రయత్నం చేశాను. ఇందు కోసం స్పెయిన్‌లోని కొన్ని కంపెనీలతో సంప్రదింపులు కూడా జరిపాను. ట్రాన్స్ సమాజంలో దుర్భర జీవితం గడుపుతున్న వారి సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని కంపెనీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఏడాదికి సంబంధించి నవంబర్‌లో న్యూఢిల్లీలో మిస్ యూనివర్స్ ట్రాన్స్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కింది. ఈ పోటీల్లో పాల్గొనడానికే ఇండియాకు వచ్చా. ఇక్కడ మా ఊరి ప్రజలు నన్ను చూసి చాలా సంతోషపడ్డారు. ప్రతి ఒక్కరూ నన్ను ఆశీర్వదించారు. ఇక్కడ ఏ కార్యక్రమం జరిగినా నేనే చీఫ్ గెస్ట్. ఇంతకంటే గౌరవం ఏమి కావాలి?



త్రిలింగ దర్శనం కోసం ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి టౌన్: కార్తీక మాసంలో త్రిలింగ దర్శనం పేరుతో తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి, యాగంటి, మహానంది క్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్ తెలిపారు. బస్సుల నిర్వహణపై ట్రాఫిక్, గ్యారేజ్, ఆర్ఎం కార్యాలయం సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్షించారు. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకూ ప్రతి సోమవారం జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఉదయం 5 గంటలకు బస్సులు బయలుదేరి, తిరిగి సాయంత్రం ఆయా డిపోలకు చేరుతాయన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచుతామన్నారు. 40 మంది భక్తులు ఒక గ్రామం నుంచి వెళ్లాలనుకుంటే ఆ గ్రామం నుంచే బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ సదుపాయంతో పాటు సమీప బస్‌స్టేషన్, ఏటీబీ ఏజెంట్ల వద్ద కూడా రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న ఆర్ఎం మధుసూదన్

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

మడకశిర: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ డ్రై డేను విధిగా పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి కోరారు. శుక్రవారం మడకశిరలోని వివిధ వార్డుల్లో ఆమె పర్యటించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లతో కలసి డ్రై డేపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్


రమేష్ (ఫైల్)


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పెనుకొండ: వ్యక్తి హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పెనుకొండ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను హిందూపురం డీఎస్పీ మహేష్ వెల్లడించారు. పరిగి మండలం శిరేకోళం గ్రామానికి చెందిన కురుబ రమేష్‌కు పరిగి మండలం శ్రీరంగరాజుపల్లికి చెందిన యువతితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. పెయింటింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న రమేష్ కొంత కాలంగా తాగుడుకు బానిస కావడంతో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి కేతేపల్లికి చెందిన చాకలి రాజుతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో తరచూ తనతో గొడవ పడుతున్న భర్తను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న ఆమె తన ప్రియుడు రాజు, అతని మేనమామ సుబ్బరాయప్ప అలియాస్ సుబ్బుతో కలసి పథకం రచించింది. ఇందులో భాగంగానే ఈ నెల 19న మధ్యాహ్నం రొద్దం మండలం ఎల్‌జీబీ నగర్ వద్ద ఉన్న ఈత వనానికి రమేష్‌ను రప్పించుకున్న రాజు మాటల్లో ఫుల్‌గా కల్లు తాపించాడు. అదే సమయంలో సుబ్బరాయప్పతో కలసి రమేష్ భార్య అక్కడకు చేరుకుంది. అప్పటికే ఫుల్‌గా కల్లు సేవించి తూలుతున్న రమేష్ డొక్కలో రాజు కత్తితో పొడిచి అనంతరం గొంతు కోసి హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని గుర్తు పట్టకుండా ద్విచక్ర వాహనాల్లోని పెట్రోల్ తీసి హతుడిపై పోసి నిప్పంటించి వెళ్లిపోయారు. కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ రత్న ఆదేశాల మేరకు సీఐ రాఘవన్ నేతృత్వంలో రొద్దం, పరిగి ఎస్ఐలు, సిబ్బంది మూడు బృందాలుగా విడిపోయి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. పక్కా ఆధారాలతో నిందితులు ముగ్గురిని శుక్రవారం అరెస్ట్ చేసి, వారి నుంచి కత్తి, సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

ట్రాక్టర్ బోల్తా... రైతు మృతి


మృతుడు దామోదర్

ధర్మవరం రూరల్: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం మండలం ఏలుకుంట్ల గ్రామానికి చెందిన రైతు దామోదర్ (35) తన మామిడి తోటలో కలుపు తీసేందుకు శుక్రవారం ఉదయం ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్నాడు. ఆ సమయంలో అదుపు తప్పి 8 అడుగుల లోతు పల్లంలోకి బోల్తా కొట్టిన ట్రాక్టర్ కిందపడి దామోదర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య ఈశ్వరమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నీట మునిగి వృద్ధురాలి మృతి


ఈరమ్మ (ఫైల్)

పుట్టపర్తి టౌన్: ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వృద్ధురాలు మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన మేరకు... కొత్తచెరువు మండలం ఇరగంపల్లికి చెందిన అంకె అంజినేయులు భార్య ఈరమ్మ (62) శుక్రవారం ఉదయం తోటి మహిళలతో కలసి బట్టలు ఉతికేందుకు గ్రామ శివారున ప్రవహిస్తున్న వంగపేరు నది వద్దకు వెళ్లింది. దుస్తులను నీటిలో ముంచి తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి ప్రవాహంలోకి పడిపోయింది. మహిళలు కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న వారు అక్కడకు చేరుకుని ప్రవాహవేగానికి కొట్టుకు పోతున్న ఆమెను కాపాడేందుకు విఫలయత్నం చేశారు. చివరకు చెట్టుకు తగులుకుని నిలిచిన ఆమెను కాపాడి వెలికి తీసేలోపు మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

'ముద్ద' వ్యాధిపై అప్రమత్తం

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అగ్రికల్చర్: పశువుల్లో ముద్ద చర్మవ్యాధి ప్రబలకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు ఉభయ జిల్లాల పశుసంవర్ధకశాఖ జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ శుభదాస్, స్థానిక పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర తెలిపారు. 'కబలిస్తున్న ముద్ద వ్యాధి' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆ శాఖ జేడీలు, ఏడీ స్పందించారు. 2022 పరిస్థితులు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకున్నామన్నారు. అనంతపురం జిల్లాలో 2.37 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాలో 2.89 లక్షల గోట్‌ఫాక్స్ వ్యాక్సినేషన్ పశువులకు ఇచ్చామన్నారు. అక్కడక్కడ ఒకటి అరా కనిపిస్తున్నా... వ్యాధి ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యాధిని సమూలంగా నివారించేలా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 108 మంది ఎంపిక


జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

మడకశిర: స్థానిక ఎస్వీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 108 మందికి ఉద్యోగాలు దక్కాయి. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఎంప్లాయిమెంట్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో 8 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఆయా కంపెనీల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను ఎంపిక చేశారు. మొత్తం 223 మంది నిరుద్యోగ యువతీయువకులు హాజరు కాగా, 108 మందికి ఆఫర్ లెటర్లను కంపెనీ ప్రతినిధులు అందజేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హేమలత, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్‌రెడ్డి, స్కిల్ హబ్ సెంటర్ కో-ఆర్డినేటర్ సాయి గణేష్, సీడాప్ జేసీఓలు ఆంజనేయులు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబండ్ల పోటీలో అపశ్రుతి


ఎద్దు కళేబరాన్ని ఖననానికి తరలిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండలంలోని వెలుగు మాకులపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలో అపశ్రుతి చోటు చేసుకుంది. గ్రామంలోని గంగమ్మ ఆలయం వద్ద ఎడ్లబండ్లను పరుగెత్తిస్తున్న సమయంలో కొత్తచెరువుకు చెందిన రైతు నాగప్ప ఓ ఎద్దు గుండెపోటుకు గురై కుప్పకూలి మృతి చెందింది. రూ.1.90 లక్షల విలువైన ఎద్దును కోల్పోవడంతో రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. అనంతరం ఎద్దు కళేబరానికి అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత రైతును ఆదుకుంటామని గ్రామస్తులు భరోసానిచ్చారు.

పెళ్లైన మూడు నెలలకే మొహం చాటేశాడు!


భర్త ఇంటి ఎదుట కుటుంబసభ్యులతో కలసి బైఠాయించిన మీనాక్షి

పెనుకొండ రూరల్: పెళ్లైన మూడు నెలలకే యువకుడు మొహం చాటేయడంతో కుటుంబసభ్యులతో కలసి బాధితురాలు ఆందోళన చేపట్టింది. వివరాలు... గోరంట్లకు చెందిన మీనాక్షి, పెనుకొండ మండలం అడదాకులపల్లికి చెందిన అనిల్ ఇద్దరూ సమీపబంధువులు. వీరిద్దరూ మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపి, వారిని ఒప్పించి ఈ ఏడాది జూన్ 2న పెళ్లి చేసుకున్నారు. పెళ్లి తిరిగింపుల అనంతరం పది రోజులు అత్తారింట్లో ఉన్న మీనాక్షి అనంతరం ఆషాఢ మాసం రావడంతో పుట్టింటికి చేరుకుంది. ఆషాఢ మాసం అనంతరం ఉపాధి కోసం బెంగళూరుకు అనిల్‌ను తల్లిదండ్రులు పంపారు. ఆ సమయంలో అత్తారింటికి చేరుకున్న మీనాక్షిని మరికొన్ని రోజులు పుట్టినింట్లో ఉండేలా మామ అంజినప్ప ఒప్పించి వదిలేసి వచ్చాడు. అప్పటి నుంచి తన భర్త ఆచూకీని అత్త, మామ తెలపకపోవడంతో శుక్రవారం ఉదయం అత్తారింటి ఎదుట తన కుటుంబసభ్యులతో కలసి మీనాక్షి బైఠాయించి ఆందోళన చేపట్టింది.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు


ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో అండర్ 14 ఎస్‌జీఎఫ్ బాలబాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జేపీ అనిల్‌కుమార్, ఎంఈఓ గంగప్ప, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మొరార్జీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డీఈ రమేష్, హెచ్ఎం సామ్రాజ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ లోకనాథ్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఏపీ ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, అబ్జర్వర్ అనిల్‌నాయక్, పీఈటీలు శివకుమార్, వెంకటేష్, రామకృష్ణ, రామకృష్ణ, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

హిందూపురం అర్బన్: మండలంలోని మణేసముద్రం సమీపంలో శుక్రవారం రాత్రి రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్ఐ బాలాజీ, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని మడకశిర మండలం వజ్రపాలెం గ్రామానికి చెందిన శంకర్ (35)గా గుర్తించారు. భార్య, కుమారుడు ఉన్నారు. ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడిన ఆయన జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నిందితుడికి రిమాండ్

యాడికి: తండ్రిని హతమార్చిన కేసులో కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను సీఐ ఈరన్న వెల్లడించారు. మండలంలోని వీరన్నపల్లికి చెందిన వజ్రా లక్ష్మీనారాయణ పెద్ద భార్య వరలక్ష్మి కుమారుడు కార్తీక్... ఈ నెల 23న మధ్యాహ్నం యాడికిలో తన తండ్రిని హతమార్చిన విషయం తెలిసిందే. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం ఉదయం కమలపాడు రహదారిలో ఉన్న కార్తీక్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిని పంపకాలు చేసివ్వలేదన్న అక్కసుతో తండ్రిని హతమార్చినట్లుగా నిర్ధారణ అయింది.

యువకుడి ఆత్మహత్య


బాలకృష్ణ (ఫైల్)

రొద్దం: మండలంలోని నారనాగేపల్లి గ్రామానికి చెందిన రంగారు ఉమాశంకర్ ఒక్కగానొక్క కుమారుడు జె.బాలకృష్ణ(28) ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ వ్యవహారమే ఇందుకు కారణంగా ప్రాథమిక విచారణలో పోలీసులు నిర్ధారించారు. గురువారం రాత్రి మేడపై ఉన్న గదిలో బాలకృష్ణ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఎంత సేపటికీ కిందకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూశారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించడంతో బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు ముందు ఓ యువతితో ఫోన్‌లో మాట్లాడినట్లుగా గుర్తించారు. అలాగే వాట్సాప్ మెసేజ్‌లు పరిశీలించి ప్రేమ వ్యవహారమే ఇందుకు కారణంగా నిర్ధారించారు.

పాముకాటుతో మహిళ మృతి


నీలమ్మ (ఫైల్)

రొళ్ల: పాముకాటుతో ఓ మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం పీసీ గిరి గ్రామానికి చెందిన శివన్న భార్య నీలమ్మ (55) శుక్రవారం అగళి మండలం హళ్లికెర గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పత్తిని విడిపించేందుకు కూలి పనులకు వెళ్లింది. సాయంత్రం 4.30 గంటల సమయంలో పత్తిని విడిపిస్తున్న సమయంలో పాముకాటు వేయడంతో తోటి కూలీలు గుర్తించి వెంటనే రొళ్లలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి తరలించే లోపు ఆమె మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.